www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -145 మంగళవారం 8 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' మరోసారి పొడిగింపు

**అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ**

**సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం**

**నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల**




**హైదరాబాద్,సెప్టెంబర్ 7(ప్రజావినికిడి):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ మిగతా 2లో.

## త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

**1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు**

**అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత**

**కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర**


2లో.

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు

## సభలో కన్నీరు పెట్టిన తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్**

**తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం**

**ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం**

**బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 7(ప్రజావినికిడి):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది. మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం మిగతా 2లో.





## డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం

**వేధిస్తే కఠిన చర్యలు: ఏపీ ప్రభుత్వం**



**స్పోర్ట్స్ కోటా ఎంపికలు పారదర్శకంగా జరిగాయన్న క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)**

**ఉపాధ్యాయులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**టెట్ అర్హతలపై పలువురు అభ్యర్థుల విషయంలో స్పష్టత ఇచ్చిన అధికారులు**

**అమరావతి సెప్టెంబర్ 7(ప్రజావినికిడి):** ఏపీ మెగా డీఎస్సీ 2025 నియామకాలపై గత పది రోజులుగా సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. స్పోర్ట్స్ కోటా సహా ఇతర నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేసింది. అమరావతిలోని విద్యాభవన్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ భరణి సంయుక్తంగా మిగతా 2లో.

## ఇది దుశ్శాసన సభ..

**మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్**

**శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్**

**తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి**

**ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7: (ప్రజావినికిడి):** ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మిగతా 2లో.

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ**

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి**

**2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం**

**పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 7:(ప్రజావినికిడి):** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని మిగతా 2లో.





## రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం

**ఆ రెండు ఫ్యాక్షన్ పార్టీలే.. ప్రజలకు గోరంత, తమకు కొండంత వాటి ఎజెండా: విజయసాయిరెడ్డి**

**కొత్త పార్టీ పెట్టడానికి ముందు ప్రజల సమస్యలు వివరిస్తానని వెల్లడి**

**ఏపీలో వైసీపీ, టీడీపీ, జనసేనలకు ప్రజా సమస్యలు పట్టవని విమర్శ**

**రాష్ట్ర సంపదను దోచుకోవడమే ఆ పార్టీల ఎజెండా అని వ్యాఖ్య**

**ఈ పరిస్థితుల్లో మూడో ప్రత్యామ్నాయం తప్పనిసరి అన్న విజయసాయి**

**అమరావతిసెప్టెంబర్ 7:(ప్రజావినికిడి):** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో మిగతా 2లో.

# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ బిగ్ ఫైట్..

**కేటీఆర్ అరెస్టు, టీషర్ట్ విప్పేసిన హరీశ్ రావు -కేటీఆర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్-పోలీసుల మధ్య తోపులాట -పలువురు నేతలు టీషర్టులు విప్పి నిరసన**

**నేతలకు గాయాలైనట్లు బీఆర్ఎస్ ఆరోపణ- కౌశిక్‌రెడ్డి సహా నేతలతో పోలీసుల వాగ్వాదం**


2లో.

## కార్యకర్తలే బలం..

**లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు**

**కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన**

**సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ**



**అమరావతి సెప్టెంబర్ 7: (ప్రజావినికిడి):** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది మిగతా 2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం

**మొదటిపేజీ తరువాయి**

మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలు పారదర్శకం: శాప్**

స్పోర్ట్స్ కోటా ఎంపికలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరిగాయని శాప్ ఎండీ భరణి తెలిపారు. తుది జాబితాకు ముందు 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించామని, ఆ సమయంలో జూడో సర్టిఫికెట్లపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని వివరించారు.

ప్రస్తుతం హైకోర్టులో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యం (గ్రూప్ చీ.శీ. 170) కూడా డీఎస్సీ నియామకాలు పూర్తయిన ఏడాది తర్వాత దాఖలైందని, దాని పరిధి 2018 నుంచి జరిగిన అన్ని క్రీడా కోటా నియామకాలపై ఉందని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో రాత పరీక్ష మార్కులతో సంబంధం లేకుండా క్రీడాకారుల ప్రతిభకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, ఇది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధారణ ప్రక్రియ అని స్పష్టం చేశారు.

కొందరు క్రీడాకారులపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు ఖండించారు. జాతీయ స్థాయి బాక్సర్ పెద్ద అప్పల రాజు విషయంలో ఆన్‌లైన్‌లో పొరపాటున సోదరుడి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసినా, తర్వాత సరిదిద్దుకున్నారని.. ఆయన పత్రాలన్నీ నిజమైనవేనని వీడియో ఫుటేజ్‌తో సహా నిర్ధారించుకున్నామని తెలిపారు. అలాగే, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీడీపీ ఎమ్మెల్యే కోన రవికుమార్ సంతకం చేయడంపై మాట్లాడుతూ.. జాతీయ సమాఖ్య అధికారికంగా అనుమతి ఇచ్చినందునే ఆయన సంతకం చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధం కాదని స్పష్టం చేశారు.

**టెట్ అర్హతలపై పూర్తి స్పష్టత**


టెట్ అర్హత మార్కుల విషయంలో వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా వివరణ ఇచ్చారు. కర్నూలుకు చెందిన అభ్యర్థి ప్రభాకర్ (బీసీ) టెట్‌లో 77 మార్కులు సాధించి అర్హత పొందారని, దీనిపై మరింత స్పష్టత కోసం సెప్టెంబర్ 5న త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.

అదేవిధంగా, జంపాల ఉష (బీసీ) 2012లోనే టెట్‌లో 80 మార్కులతో అర్హత సాధించారని, అప్పట్లో లాంగ్వేజ్ పండిట్లకు ప్రత్యేక టెట్ లేదని, ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. మిగిలిన అభ్యర్థుల అర్హతలు కూడా నిబంధనల ప్రకారమే ఉన్నాయని వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ రెవెన్యూ శాఖ పరిధిలోని అంశమని, అనుమానం ఉన్న సర్టిఫికెట్లను పునఃపరిశీలన కోసం జిల్లా కలెక్టర్లకు పంపామని తెలిపారు.

# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ బిగ్ ఫైట్..







**హైదరాబాద్, సెప్టెంబర్ 7:(ప్రజావినికిడి):** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నినాదాలు రాసిన నల్ల టీషర్టులు ధరించి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు గేటు వద్దే అడ్డుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఉదయం గన్‌పార్క్ నుంచి ర్యాలీగా అసెంబ్లీ గేటు వద్దకు నల్ల టీషర్టులు ధరించి ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అయితే వారిని పోలీసులు అడ్డుకోగా.. వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడా వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అయితే టీషర్ట్ విప్పి లోపలికి వెళ్తామని మాజీ మంత్రి హరీశ్ రావుతోపాటు పలువురు నేతలు టీషర్టులు తీసేశారు. బనియన్ పైనే లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా పోలీసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర గందరళగోళం నెలకొంది. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ప్రజాప్రతినిధులను అరెస్టు చేశారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డి కింద పడిపోయారు. కేటీఆర్ తో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో వారికి గాయాలయ్యాయని తెలిసింది. అరెస్టు అనంతరం నేతలను తెలంగాణ భవన్‌కు తరలించారు.

ఇదిలావుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అలాగే, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని నెట్టారంటూ ఆరోపించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్ సీపీ సజ్జనార్ అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మహిళా ఎమ్మెల్యే చీర లాగిన అంశంపై పోలీస్ సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే అంశంపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్పందించారు. అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ టీషర్ట్‌లు వేసుకురావడం నేరం కాదని, అయితే వాటిపైన అభ్యంతకర పదాలు ఉండటంతో లోపలికి అనుమతించలేదని వివరించారు. తాము ఎవ్రితోనూ అసభ్యకరంగా ప్రవర్తించలేదన్నారు. అలాంటిది ఏమైనా ఉంటే వీడియోలు చూసి పరిశీలిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. అసెంబ్లీ స్పీకర్ సూచన మేరకు తాము నడుచుకుంటున్నట్టు డీసీపీ చెప్పారు.

**అడ్డగోలు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్ : కేటీఆర్, హరీశ్‌రావు**

కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సబండ వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని 420 హామీలు ఇచ్చారని తెలిపారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని రకాలుగా సభలో అవమానించినా ప్రజల కోసం హామీల అమలుపై ప్రశ్నించాలని తమ అధినేత సూచించినట్టు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలు కొత్త కాదని, గతంలో ఎన్నో చూశామన్నారు. 22 ఏ ద్వారా ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టిన ఈ ప్రభుత్వాన్ని ప్రజలే నిషేధిస్తారని హెచ్చరించారు సీఎం, మంత్రుల బంధువులకు అక్రమంగా భూ కేటాయింపులు చేస్తున్నారని ఆరోపించారు. గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి ర్యాలీగా బయలుదేరారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

**మొదటిపేజీ తరువాయి**

పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు.కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

## త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 7:(ప్రజావినికిడి):** దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' మరోసారి పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి**

వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది.

గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## స్పీకర్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు..

**మొదటిపేజీ తరువాయి**



ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు.శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. "స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే..స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించరని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు మండలి సభ్యులు బూతులు మాట్లాడారన్నారు. తాతా మధు, నవీన్ మీద చర్యలు తీసుకోవాలని.. వీధుల్లో కొట్లాడినట్లు.. అసెంబ్లీ ముందు ప్రవర్తించారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని.. కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగిందని సీతక్క పేర్కొన్నారు. సభలో ప్రసంగిస్తూ మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు.. స్పీకర్ స్థానాన్ని అవమానించడం సరికాదన్నారు..

## రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం

**మొదటిపేజీ తరువాయి**

ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు."అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు.

కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు.

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.

రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు:**తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు.

బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం:** రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు.కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## ఇది దుశ్శాసన సభ..

**మొదటిపేజీ తరువాయి**

మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు.గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు.పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో చారిత్రక ఫిరంగి నాలకు చమర గీతం..

### జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఫిరంగినాలను ఆక్రమించి అక్రమ రిటర్నింగ్ వాల్ ..

### కలెక్టర్ కార్యాలయనికి కూత వేటు దూరంలో ఇంత జరుగుతున్న కన్నెత్తి చూడని ఇరిగేషన్ శాఖ..

### ఆదిభట్లలో ఫిరంగి నాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కలెక్టరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఫిరంగినాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు.ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ, గతంలో హైదరాబాద్ నగరంపై వరద ప్రభావం తగ్గడానికి నిర్మించిన ఫిరంగి నాల రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలంలో చందనవెల్లి గ్రామంలో మొదలుకొని ఇటుపక్క ఉన్న ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు 104 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా నీరు అందించే ఫిరంగి నాల కాలువపై నేడు అభివృద్ధి పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఫిరంగి కాలువను పుడిచి వేస్తూన వైనం పట్ల విచారం వ్యక్తం చేశారు.ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో ఫిరంగి నాలను పూడ్చివేసి నాలాకు అడ్డుగా రిటర్నింగ్ వాళ్ళు



నిర్మిస్తూ,బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.నేడు ప్రకృతి వనరులపై రియల్ ఎస్టేట్ సంస్థలు, పంజా విసురుతున్నాయన్నారు. జిల్లా కలెక్టరేట్ పక్కనే ఫిరంగినాలపై ఇటు రెవెన్యూ శాఖ,ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఫిరంగినాలను సంరక్షించాలని,ఆక్రమణలకు పాల్పడ్డ వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ప్రకృతి వనరులైన చెరువులు,కుంటలు, నాలాలను సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు సాగునీరుకు,త్రాగునీరుకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదని ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు నిద్రవస్థా నుండి మేలుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఫిరంగి నాలను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు నీరు అందే విధంగా చూడాల్సిన ఇరిగేషన్ శాఖ,రెవెన్యూ శాఖ అధికారులకు కలెక్టరేట్ కార్యాలయం పక్కనే ఇంత తతంగం జరుగుతున్న కన్నెత్తి చూడని వైనం పట్ల ఆయన విచారం వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,టిడిపి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులుతో పాటు భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ కృష్ణమాచారి,ఆదిపట్ల మున్సిపాలిటీ హర్షవర్ధన్ రెడ్డి, మంచాలు పార్టీ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి,దామోదర్ రెడ్డి, సురేష్,రామ్ రెడ్డి,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడి

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్

**కేశంపేట,(ప్రజావినికిడి):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గంగా, అప్రజాస్వామికంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళు_న్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడం, తోపులాటకు దారితీయడం, అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించిన తీరు మరింత బాధాకరం.ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ఎమ్మెల్యేలను గౌరవించకుండా నెట్టివేయడం, బలవంతంగా అడ్డుకోవడం వంటి ఘటనలు తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తున్నాయని రవీందర్ యాదవ్ అన్నారు.ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రతిపక్షం గొంతు వినిపించకుండా అసెంబ్లీని నడపాలనుకోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనం.ప్రజల సమస్యలు, ఎన్నికల హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించడమే ప్రతిపక్షం బాధ్యత.ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని



ఆయన విమర్శించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తే అరెస్ట్.. నిలదీస్తే కేసులు..**

ప్రజల కోసం పోరాడితే అణచివేత అనే విధానాన్ని అవలంబిస్తోందని రవీందర్ యాదవ్ ఆరోపించారు. తెలంగాణప్రజలుప్రజాస్వామ్యాన్ని,పోరాటాల చరిత్రను ఎంతో గౌరవిస్తారని, అధికారంలో ఉన్నామని అహంకారంతో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.కేటీఆర్, హరీశ్‌రావు సహా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను వెంటనే విడుదల చేయాలి. మహిళా ప్రజాప్రతినిధులతో అనుచితంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై విచాంరణ జరిపి చర్యలు తీసుకోవాలి. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగబద్ధమైన గౌరవం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఇది కేవలం బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడి కాదు,తెలంగాణ ప్రజాస్వామ్య హక్కులపై జరిగిన దాడి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం ఆగదని,ప్రజా సమస్యలను అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ నిరంతరం ప్రశ్నిస్తామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,మాజీ పిఎసిఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్,మాజీ జడ్పీటిసి పల్లె నర్సింగ్ రావు బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు

### కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని జిల్లేడు చౌదరి గూడ మండల లోనిపద్మారం,జాకారం,ముష్టిపల్లి తండా గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేసిన కుటుంబాలను ఆయన అభినందించి,వారి నూతన జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే



ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచులు బందయ్య,నీలయ్య,సనా సలీం,చందు నాయక్,మాజీ సర్పంచులు నరసింహులు, యాదయ్య,మాజీ ఎంపీటీసీ గోబ్రే నాయక్,కిసాన్ సెల్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, అధ్యక్షులు రజిత,వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్, నాయకులు యాదయ్య, రాజేష్,మంగే నాయక్,నరేందర్,మాజీ సర్పంచ్ తనయుడు సలీం,ఎంపీపీ తనయుడు ఆంజనేయులు, సర్పంచ్ సనా హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

# వాజేడులో బిఆర్ఎస్ పార్టీ భారీ ర్యాలీ

### ప్రజా పాలనకు 1000,రోజులు గడుస్తున్నా 6,గ్యారంటీలు, 420,హామీలు, ఎప్పుడు అమలు చేస్తారో చెప్పలని డిమాండ్.



**వాజేడు సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**ములుగు జిల్లా వాజేడు మండలంలో టిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన భారీ ర్యాలీ విజయవంతమైంది తెలంగాణ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన మొదలై 1000, అయినందున 6 గ్యారంటీలు 420, హామీలు నెరవేర్చాలంటూ సోమవారం చీకుపల్లి నుండి బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు 8 వందల మోటార్ సైకిలతో భారీ ర్యాలీ చేపట్టారు చీకుపల్లి నుండి జగన్నాపురం మీదుగా వాజేడు చేరుకొని వాజేడులో భారీ ర్యాలీ నిర్వహించి అక్కడి నుండి ఎంపీడీవో ఆఫీసుకు చేరుకొని ఈరోజు జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో ఈ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6, గ్యారంటీలు 420 హామీలు నెరవేర్చాలంటూ వినతిపత్రం సమర్పించారు. తర్వాత మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు హామీలు ఇచ్చి గద్దెనెక్కి అమలు చేయవలసిన ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్ళదీస్తుంది నేటికీ 1000 రోజులు పూర్తి చేసుకున్న ఇప్పటికీ ఏ హామీ ప్రజలకు అందలేదని ఎద్దేవా చేశారు రైతుబంధు 15000 ఇస్తానని ఇవ్వలేదు మహిళలకు నెలకు 2500 ఇస్తానని ఇవ్వలేదు యువతులకు స్కూటీలు ఇవ్వలేదు 2, లక్షల రుణమాఫీ పూర్తిగా జరగలేదు 500 కు గ్యాస్ ఇవ్వలేదు కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వలేదు 4 వేల ఫించన్ అమలు చెయ్యలేదు ఇవేగాక 420, హామీలు అమలు చేయకుండా ప్రజా పాలన అంటూ ప్రజలని ఇబ్బందులకు గురిచేస్తూ వంద రోజుల్లో అమలు చేస్తానన్న హామీలు 1000 రోజులైనా అమలు కాలేదు అన్నారు అలాగే చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొదెబోయిన బుచ్చయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి వంద రోజుల్లో అమలు చేస్తాను అన్న ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తూ నేటికీ 1000 రోజులు అయినా ఎలాంటి హామీ జరగలేదని అన్నారు ముఖ్యంగా రైతులకు 24,గంటల కరెంటు ఇవ్వడం లేదని ఎరువుల కొరత ఉందని ఎరువుల కోసం యాప్ లు, ఎందుకని ఎద్దవా చేశారు తెలంగాణలో ఎంతోమంది టచ్ ఫోన్ లేని రైతులు ఉన్నారని అలాంటప్పుడు రైతులకు ఎరువు బస్తాలు ఎలా అందుతాయని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు చనిపోతే రైతుబీమా అందకుండా ఈ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు ఉప సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# 1/70 చట్టం అమలుకై అసెంబ్లీ తీర్మానం చేయాలి

### జిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్



**వాజేడు, సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**సోమవారం నాడు వెంకటాపురం ఆర్&బి గెస్ట్ హౌస్ ఆవరణంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం.జిఎస్పి ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ, 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టం పటిష్టంగా అమలుకై ఆదివాసి ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి చట్టాలపై గిరిజనేతరులు దాడులు చేసే ప్రయత్నం చేస్తున్నారని గిరిజనేతరుల కుట్రాలను తిప్పి కొట్టాలంటే అసెంబ్లీలో 1/70 చట్టాన్ని ప్రతి ష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఏజెన్సీ ప్రాంతంలోకి వలస గిరిజనేతరులు 1/70 చట్టానికి విరుద్ధంగా వచ్చి ఆదివాసి భూములను మరియు ప్రభుత్వ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ ఆదివాసి చట్టాలపై జీవోలపై దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు ఏజెన్సీ ప్రాంతం నుండి బూర్జువ రాజకీయ పార్టీలను బహిష్కరించినప్పుడే ఆదివాసి చట్టాలు జీవోలు అమలు అవుతాయని లేదంటే బూర్జువ రాజకీయ పార్టీలు ఆదివాసి చట్టాలను భూస్థాపితం చేస్తారని ఆదివాసి చట్టాల కోసం ఆదివాసీలు ఉద్యమించి 1/70 చట్టం అమలు కోసం నిరంతర ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు భారతదేశానికి స్వతంత్రం వచ్చి 89 ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ కూడా ఆదివాసి చట్టాలను అమలు చేయడం లేకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు ఆదివాసి చట్టాలు ఉండటం వల్లనే ఆదివాసి రిజర్వేషన్ తోనే ఆదివాసి ఎమ్మెల్యేలు గెలుపొంది అసెంబ్లీకి వెళ్లారని ఆ రిజర్వేషన్లు రద్దు చేయాలని గిరిజనేతరులు మాట్లాడుతుంటే ఆదివాసి ఎమ్మెల్యేలు కనీసం ఇప్పటికీ కూడా స్పందించలేకపోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు ఏజెన్సీ ప్రాంతంలో 1/70 మరియు పిసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని అసెంబ్లీ తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పద్దం సుధాకర్, కారం రాజబాబు, సురేష్, లక్ష్మయ్య,తదితరులు పాల్గొన్నారు

# మా ఊరి సమస్యలు తీర్చండిసారు



**వాజేడు, సెప్టెంబర్ 8,(ప్రజావినికిడి):**

కోయవీరాపురం గ్రామ సమస్యల పైన వాజేడు ఎంపిడీఓ కృపాకర్ కు, ప్రజావాణిలో తుడుందెబ్బ మండల కమిటి అద్వర్యంలో వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇండ్లు చీకుపల్లి నుండి కోయ వీరాపురం వరకు రోడ్డు నిర్మానం వంటి అంశాల గురించి విన్నవించటం జరిగింది.ఈ కార్యక్రమం లో తుడుందెబ్బ మండల ఆద్యక్షులు తొరెం సంతోష్, మండల్ ప్రధాన కార్యదర్శి చాప లక్ష్మణ్, ఉపాద్యక్షులు వాసం సంతోష్ పాల్గొన్నారు

## మట్టి వినాయకుల ప్రతిష్ఠకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి..

**మహాత్మా గాంధీ లా కాలేజీలో మట్టి వినాయకుని పోస్టర్ ఆవిష్కరణ..**

**లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన**




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణలో భాగంగామట్టి వినాయకులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత ఆధ్వర్యంలో మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ లా కాలేజీలో కాలేజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రాధాన్యతను తెలియజేసే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేతమాట్లాడుతూ,వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూబాధ్యతతీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని, జలచరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి, పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని సూచించారు.మట్టి వినాయకుడు మన బాధ్యతఅనే నినాదంతో లైఫ్ సేవర్స్ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని శివ నేత తెలిపారు.కాలేజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.లైఫ్ సేవర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి వినాయకుల అవగాహన కార్యక్రమం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత, శంకరాచారి, సుధీర్,రవితేజ, స్పర్శ,అనూష, పృథ్వి తదితరులు పాల్గొన్నారు. మట్టి వినాయకులను ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి బైఠాయించి నిరసన



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులతో అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు కర్మన్ ఘాట్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, ప్రతిపక్ష నేతల గొంతుకను అణచివేసే వైఖరిని విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టారు.

## పేదల పట్ట భూములను నిషేధిత జాబితాలో చేర్చవద్దు

**రాజ్య సభ ఎం పి ఆర్ కృష్ణయ్య**

**ప్రభుత్వ నిషేధిత భూములలో అపార్ట్మెంట్లు, ఫామ్ హౌస్ లు, ప్లాట్లు చేస్తే 22 ఏ లో పెట్టాలి**






**హైదరాబాద్,(ప్రజావినికిడి):**రాష్ట్రంలో 22ఏ పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు చెందిన పట్టా భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర అన్యాయం చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ పర్మిషన్లు, హెచ్ఎండీఏ, హుడా అనుమతులు పొంది,ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని, క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్,నీటి బిల్లులు చెల్లిస్తున్న భూములను కూడా హఠాత్తుగా 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమన్నారు.ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా భూ సమస్యలను సృష్టిస్తోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన సొంత బలం లేదా కాంగ్రెస్ పార్టీ బలంతో మాత్రమే గెలవలేదని, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు వీధుల్లో ప్రచారం చేసి కాంగ్రెస్‌కు అధికారం అందించారని అన్నారు. ఆ అధికారాన్ని సొంత బలంగా భావించి నిరంకుశ పాలన సాగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శ్రీలంక,నేపాల్, అమెరికా వంటి దేశాల్లో యువత తిరగబడినట్లే తెలంగాణలోనూ పాలకులపై యువత తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారుప్రభుత్వ భూములు, ఎండోమెంట్స్, వక్ఫ్ భూములను మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచాలని, అయితే పేదల పట్టా భూములను కావాలనే 22ఏలో చేర్చి, అనంతరం వారిని భయభ్రాంతులకు గురిచేసి తక్కువ ధరలకు భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించాలనే ఉద్దేశంతో రెవెన్యూ, పోలీసు అధికారులను తమ చేతుల్లో పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం ఎంఆర్వోలు, కలెక్టర్లు, డీఎస్పీలు,సీఐల బదిలీలు, పోస్టింగులు చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ పరిధిలోని అంశాలని,కానీ ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు చెప్పిన వారికే పోస్టింగులు ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో అధికారులు ప్రజలకు కాకుండా ఎమ్మెల్యేలకు గులాంగిరి చేసే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. భూమి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని,అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలు పోరాడాలని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులంతా తమ సమస్యలను ప్రజా సంఘాల దృష్టికి తీసుకురావాలని, నాయకుల మెడలు వంచైనా బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. తెహల్కా మీడియా నెట్వర్క్ ఎడిటర్ కే.చంద్ర శేఖర్ ఆధ్వర్యములో జరిగిన ఈ సమావేశానికి సౌత్ ఇండియన్ జర్నలిస్ట్ ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ సి. శ్యామ్ కుమార్ అధ్యక్షత వహించారు.తెలంగాణ విఠల్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ,సోమ శేఖర్, నారగొని ప్రవీణ్,నాగరగోని ప్రవీణ్,రంగినేని శ్రీనివాసరావు,సురేష్ పొద్దార్,ముఖ్య అతిథి ఆర్.కృష్ణయ్య, ఎంపీబాలకృష్ణ ఏ1టీవీ చైర్మన్,ఎర్రబెల్లి సతీష్,బి.నర్సింగరావు,కుమార్ యాదవ్,ఉగ్గే శ్రీను,ఎం.విజయ్‌తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ డిమాండ్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను,
హామీలను వెంటనే అమలు చేసి తీరాలని బీఆర్ఎస్ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్,మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు.ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాల్గొని,స్థానిక ఎంపీడీవో శ్రీకాంత్‌కు విజ్ఞాపన పత్రాన్ని (మేమోరాండం) అందజేశారు. పట్టణ కౌన్సిలర్లు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు,13 డిక్లరేషన్లు,6 గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రధాన డిమాండ్లను అంజయ్య పేర్కొంటూ మహాలక్ష్మి, పింఛన్లు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం,తులం బంగారం,ఉచిత స్కూటీలను తక్షణమే అందించాలని,వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన రూ. 4,000 పింఛన్‌ను అమలు చేయాలని కోరారు. రైతు సంక్షేమంలో రైతులకు రైతు భరోసా పంట బోనస్,నిరంతర ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు రైతు కూలీలకు ఏటా రూ 12,000 అందించాలని స్పష్టం చేశారు. ఉపాధి,విద్య నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతితో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని,విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.అదే విధంగా స్థానిక సమస్యలలో భాగంగా నియోజకవర్గంలో ఆగిపోయిన పారిశుద్ధ్య నిర్వహణను వెంటనే పునరుద్ధరించాలని,హక్కుల కోసం ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని ప్రభుత్వానికి హెచ్చరించారు.

## రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణికి (56) ఫిర్యాదులు..

**ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి..**

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..**

**ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదుల స్వీకరణ**

**రెవెన్యూ శాఖకు 27,ఇతర శాఖలకు 29 వినతులు**

**అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి**

**ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27,ఇతర శాఖలకు సంబంధించిన 29,మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పాశీ) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి శారద,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి..

**ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలి. -ఎల్బీనగర్ నియోజకవర్గ భారస నాయకులు**




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు,6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని భారస నాయకులు డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, నేటికీ అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరుతూ సరూర్ నగర్ ఎం.ఆర్.ఓ.కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం,తులం బంగారం తదితర హామీలను అమలు చేయాలి.
రైతులకు రైతు భరోసా,ప్రతి పంటకు బోనస్,24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ వంటి హామీలను నెరవేర్చాలి.రైతు కూలీల సంక్షేమానికి రూ.12,000 సహాయం అందించాలి.ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.
అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు,జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి.
విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపుతో పాటు విద్యార్థుల సంక్షేమ హామీలను అమలు చేయాలి.వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన పెన్షన్లు అందించాలి.ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలి.బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ, విద్యార్థులు, యువజనులు, రైతులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి.గ్రామాలు, పట్టణాల్లో పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలి.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్ని ఎన్నికల హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి,జిట్ట రాజశేఖర్ రెడ్డి,భవాని ప్రవీణ్ కుమార్,పద్మానాయక్,సాగర్ రెడ్డి,జిన్నారం విఠల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చిరంజీవి,వరప్రసాద్ రెడ్డి,సత్యంచారి,శ్రీశైలం యాదవ్,రాజిరెడ్డి,తోట మహేష్ యాదవ్,జక్కిడి మల్లారెడ్డి పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీసీపీ శిరీష ని మర్యాదపూర్వకంగా కలిసిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు

**కుంగ్ ఫు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించిన డీసీపీ శిరీష**

**షాద్ నగర్ (ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ అధ్యర్యంలో కుంగ్ ఫు విద్యార్థులు షాద్ నగర్ పట్టణ డీసీపీ శిరీష ని డీసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డ్స్ – 2026 లో షాద్ నగర్ కు చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబర్చి బహుమతులు, సర్టిఫికెట్స్ గెలుపొందిన సందర్భంగా ఈరోజు షాద్ నగర్ డీసీపీ శిరీష ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు కుంగ్ ఫు,కరాటే నేర్చుకోవాలని తెలిపారు. ప్రస్తుత సమాజం లో పురుషులకు దిటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు.ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులకు దిశ నిర్దేశం చేసి అభినందించారు



# అసెంబ్లీ అరెస్టులపై సత్తుపల్లిలో బీఆర్ఎస్ నిరసన

## సండ్ర ఆధ్వర్యంలో నల్ల జెండాలతో భారీ ర్యాలీ





**సత్తుపల్లి/,సెప్టెంబర్7(ప్రజావినికిడి):** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సత్తుపల్లిలో ఆ పార్టీ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో జీవీ మాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల జెండాలు, నల్ల కండువాలతో భారీ ర్యాలీ చేపట్టారు. మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అసెంబ్లీకి నల్ల దుస్తులతో వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కని, ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం సరికాదన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిని ఖండించారు.హామీల అమలేది?కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నాయని సండ్ర అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మిషాదీముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్ల వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన సమస్యలపై వినతిపత్రాలను ప్రజావాణిలో అధికారులకు అందజేశారు.

# షాద్‌నగర్‌లో దశ 10 ది ఫుడ్ పార్క్ ప్రారంభం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్‌లో దశ 10 ది ఫుడ్ పార్క్ విజయవంతంగా ప్రారంభం కావడం పట్ల మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.దశ 10 - ది ఫుడ్ పార్క్ యజమానులు మాదురాపూర్ భార్గవ్ కుమార్ రెడ్డి, నవీన్, మల్లికార్జున్, సురేష్ మరియు మిత్రులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఫుడ్ పార్క్ విజయవంతంగా కొనసాగుతూ షాద్‌నగర్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆహారం,మంచి సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.ఇలాంటి నూతన వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు షాద్‌నగర్ అభివృద్ధికి దోహదపడతాయని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పేర్కొన్నారు.
దశ 10 - ది ఫుడ్ పార్క్ యజమానులు మాదురాపూర్ భార్గవ్ కుమార్ రెడ్డి, నవీన్, మల్లికార్జున్, సురేష్ మిత్రులకు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

# రాయలసీమకు జలధారలు

### ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి జేజేఎం - అమరజీవి జలధారలు

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో తాగు నీటి సమస్యకు పరిష్కారం

**మంగళగిరి,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టుల పనులు వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సూచించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలవారీ, వారాల వారీగా విభజించుకుని, ఎప్పటికప్పుడు పూర్తికావాల్సిన పనులపై సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా వేగంగా నిర్మాణం పూర్తి చేసి, గడువులోపు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందాలి. ప్రతి గొంతు దాహార్తి తీరాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ సంకల్పాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అమరజీవి జలధారలుగా ముందుకు తీసుకువెళ్తున్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నారు. అందులో మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో ఐదు జిల్లాల పరిధిలో చేపట్టిన ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి.




ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టారు. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద నిర్మాణం చేపట్టిన ఒక ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, అందులో మూడు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఏడు నీటి సంపులు, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్



బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర 167 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలని కళ్యాణ్ సూచించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన

### మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం

**,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది.బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి.ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు.ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.

# తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలపై చర్చ జరగాలి!

### ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ శ్యామల యాదగిరి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు.

**నాగోల్,(ప్రజావినికిడి):**
అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనా.. ప్రజల కోసం మాట్లాడాల్సిన నాయకులు గొడవలు, రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.
మరోవైపు వర్షాలు సరిగా లేక తెలంగాణలో అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఎండిపోతున్నాయి, సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయిరైతుల బాధలను అసెంబ్లీలో బలంగా ప్రశ్నించి, వారికి తక్షణ సహాయం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది.నాయకులారాడ రాజకీయ గొడవలు పక్కన పెట్టండి.ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించండి.రైతుల కోసం మాట్లాడండి.
ప్రజలకు అండగా నిలవండి.ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నది గొడవలు చూడటానికి కాదుతమ సమస్యలకు పరిష్కారం కోసం!

# డీఎస్సీలో స్కామ్ జరిగింది..

### మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐతో విచారణ జరిపించాలి: సజ్జల


**అమరావతి ,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. ఇది 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్' స్కామ్ అని అభివర్ణించిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సోమవారం అమరావతిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్ పోస్టులను అడ్డగోలుగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వ పెద్దలు స్పందించకుండా, పాఠశాల విద్య కమిషనర్, శాప్ ఎండీ వంటి అధికారులతో మొక్కుబడి సమాధానాలు ఇప్పించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జీవో)లను మార్చడం వంటి కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, 'డీ ఫ్యాక్టో సీఎం'గా వ్యవహరిస్తున్న మంత్రి లోకేశ్‌కు తెలియకుండా జరగవని, కాబట్టి శాఖాపరమైన విచారణలతో ప్రయోజనం లేదని



సజ్జల స్పష్టం చేశారు.'మెగా డీఎస్సీ' పేరుతో కొత్తగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, కానీ వాస్తవానికి తమ ప్రభుత్వ హయాంలో జగన్ నోటిఫై చేసిన 6,300 పోస్టులనే ఇప్పుడు భర్తీ చేస్తున్నారని సజ్జల గుర్తుచేశారు. పారదర్శకతకు విరుద్ధంగా, ఎంపిక వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచకుండా, అభ్యర్థులకు 'వ్యక్తిగత సమాచారం' పంపి గోప్యత పాటిస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా సజ్జల పలు ఆరోపణలు చేశారు. కోచింగ్ సెంటర్ల ద్వారా 120 ప్రశ్నలను రూ. 3 లక్షలకు అమ్ముకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో చంద్ర నాయక్, సుధా రాణి, రియాజుల్లా, పావని వంటి వారు జరగని క్రీడల్లో పాల్గొన్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించారని ఆరోపించారు. పరీక్ష రాయకుండానే రూ. 15 లక్షలు చెల్లించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించినట్లు ఓ మహిళా అభ్యర్థి టెలివిజన్‌లో అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతపురంలో గణితం డిగ్రీ ఉన్న తిరుమల అనే అభ్యర్థిని ఇంగ్లీష్ టెట్‌లో అర్హత లేకపోయినా ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా నియమించారని, 75 మార్కులు కటాఫ్ ఉండగా 63 మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థి విశ్వేశ్వరరావును ఎంపిక చేశారని పేర్కొన్నారు. ప్రభాకర్ అనే అభ్యర్థిపై 2025 డిసెంబర్‌లో ఆర్డీవో ఇచ్చిన నివేదికను కలెక్టర్ తొక్కిపెట్టారని ఆరోపించారు.పశ్చిమ బెంగాల్, హర్యానా వంటి రాష్ట్రాల్లో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో మంత్రులు, ఉన్నతాధికారులు సీబీఐ, ఈడీ విచారణలు ఎదుర్కొని జైలుకు వెళ్లిన విషయాన్ని సజ్జల గుర్తుచేశారు. "ఎంతకాలం బాధ్యులైన వారిని కాపాడతారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం సీబీఐ విచారణకు అంగీకరించకపోతే, తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం ఎందుకు స్వతంత్ర దర్యాప్తునకు వెనుకాడుతోందో ప్రజలు, అర్హులైన అభ్యర్థులు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు: సబితా ఇంద్రారెడ్డి

**,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**
అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు




అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు."సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్..!



**అమరావతి,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు, కర్ణాటక–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శాఖ తీపి కబురు అందించింది. కర్ణాటకలోని శివమొగ్గ టౌన్ నుండి బెంగళూరు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి నూతన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రారంభించాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఓ ఎంపీ అభ్యర్థన మేరకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ ప్రతిపాదనతో ఏపీలో మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. శివమొగ్గ పట్టణం, తిరుపతి మధ్య బెంగళూరు మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అభ్యర్థనకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ సర్వీసు కోసం అధికారిక ప్రతిపాదనను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం.తిరుపతి నుంచి రైలు అనుసంధానాన్ని విస్తరించి, మెరుగుపరచాలన్న ఎంపీ అభ్యర్థన మేరకు నైరుతి రైల్వే రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ఈ ప్రతిపాదనను చేర్చారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నందుకు రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓకు గురుమూర్తి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మిగిలిన లాంఛనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి, త్వరలోనే ఈ సేవను ప్రారంభించాలని అధికారులను కోరారు.ప్రతిపాదిత రైలు తిరుపతి, శివమొగ్గ, బెంగళూరు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని, తద్వారా యాత్రికులకు, అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఇతర ప్రయోజనాల కోసం ప్రయాణించే ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు. కర్ణాటకలోని శివమొగ్గ, బెంగళూరు పరిసర ప్రాంతాల నుండి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది. అలాగే ఉన్నత విద్య, వైద్య సేవలు, ఉద్యోగాలు, వ్యాపార నిమిత్తం బెంగళూరు, తిరుపతి మధ్య ప్రయాణించే వారికి అత్యంత వేగవంతమైన, సుఖవంతమైన రవాణా సౌకర్యం లభిస్తుంది.

# నిరుద్యోగులపై బురదజల్లుతారా?

## కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు -ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్



**అమరావతి,,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**

మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

..........


# ఏపీలోని పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన




**అమరావతి,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే మూడు గంటల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాలపై ప్రభావం అధికంగా ఉండనుందని విపత్తుల సంస్థ పేర్కొంది. ముఖ్యంగా గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేటతో పాటు వాటి పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, ఇతర తాత్కాలిక షెడ్ల కింద నిలబడటం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని కోరింది.

# మ్యాట్రీమోనీ పేరుతో భారీ మోసాలు



**హైదరాబాద్,సెప్టెంబర్7(ప్రజావినికిడి)::** పెళ్లి కుదరాలి.. పిల్లల జీవితం బాగుండాలి.. అనే తల్లిదండ్రుల ఆశ పడుతుంటారు. తమ స్థాయికి మించి కూడా మంచి సంబంధాల కోసం వెతుకుతుంటారు. బంధువులు తెలిసిన వారితో పాటు ఇటీవల కాలంలో మ్యాట్రీమోనీలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది. మీ అమ్మాయికి పెళ్లి సంబంధం చూస్తున్నారా? పెళ్లి కుదిరిందానండీ.. మాది పలానా మ్యాట్రీమోనీ.. మీ అమ్మాయికి తగిన సంబంధాలు మావద్ద ఉన్నాయి. అబ్బాయి ప్రొఫైల్ పెట్టామంటారా.. అంటూ కేటుగాళ్లు ఫోన్ లో అడుగుతారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపగానే వెంటనే వాట్సాప్‌లో ఓ అందమైన అబ్బాయి ఫొటో.. దాంతోపాటు ఆకట్టుకునే ప్రొఫైల్ పంపిస్తారు. ఎన్ఆర్ఐ.. డాక్టర్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భారీ జీతం.. కోట్ల విలువైన ఆస్తులు అంటూ ప్రొఫైల్‌ను నమ్మేలా చేస్తారు. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. మీ పేరు రిజిస్టర్ చేయాలంటే రూ.5 వేలు పంపండి. అబ్బాయి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇస్తాం. మరికొన్ని మంచి ప్రొఫైల్స్ కూడా పంపిస్తాం అంటూ నమ్మిస్తారు. పెళ్లి సంబంధం కుదిరే ఆశతో తల్లిదండ్రులు డబ్బులు పంపిస్తారు. డబ్బులు అందిన కొద్దిసేపటికే అబ్బాయి తల్లిదండ్రుల పేరుతో ఓ ఫోన్ నంబర్ ఇస్తారు. కానీ ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. "ఈ నంబర్ ప్రస్తుతం పనిచేయడం లేదు" అనే సమాధానం వస్తోంది. మ్యాట్రిమోనీకి ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వస్తుంది. వాట్సాప్‌లో పంపిన ప్రొఫైల్ లేదు.. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి లేడు.. డబ్బులు మాత్రం తిరిగి రాక తల్లిదండ్రులు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. వీటితోపాటు మరో తరహాలోనూ ఈ మోసాలు జరుగుతున్నాయి. ముందుగా పేరున్న మ్యాట్రిమోనీ సంస్థల్లో కొంత మొత్తాన్ని చెల్లించి.. అక్కడి ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తారు. పక్కా వ్యూహంతో వారికి నచ్చిన ప్రొఫైల్స్ పట్టుకుని వేటకు బయలు దేరుతారు. ఎక్కువ కాలంగా సంబంధం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. వయసు దాటిపోతున్న యువతీ యువకులు.. రెండో పెళ్లి కోసం చూస్తున్నవారు.. ఇలా ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుంటారు. ఆ తర్వాత తామే మ్యాట్రిమోనీ నిర్వాహకులమని పరిచయం చేసుకుని.. మీకు మంచి సంబంధం కుదురుస్తాం అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అడ్వాన్స్ తీసుకుంటారు. డబ్బులు చేతికి వచ్చాక ఫోన్ ఎత్తరు. ఒకవేళ ఎత్తినా.. సంబంధం మాట్లాడుతున్నాం.. కొంత సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తారు. చివరకు పూర్తిగా అందుబాటులో లేకుండా పోతారు. మ్యాట్రిమోనీ సంస్థల పేరుతో మోసగాళ్లు పక్కా వ్యూహంతో బాధితులను మోసం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు మాత్రమే తీసుకుంటారు. బాధితులు కూడా "ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇలాంటి వాళ్లు పదుల సంఖ్యలో.. వందల సంఖ్యలో కుటుంబాలను టార్గెట్ చేస్తే.. అదే పెద్ద మొత్తంగా మారుతుంది. ఈ తరహా మ్యాట్రిమోనీ కాల్స్ ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. చిన్న మొత్తాల్లోనే మోసం చేస్తుండటంతో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అందుకే బయటకు కనిపించే కేసుల కంటే.. వాస్తవంగా మోసపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.మ్యాట్రిమోనీ పేరుతో ఫోన్ వస్తే వెంటనే నమ్మొద్దని పోలీసులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. సంస్థ పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ, కార్యాలయ చిరునామా, సంప్రదింపు వివరాలు పరిశీలించాలనీ సూచిస్తున్నారు గుర్తింపు లేని వ్యక్తిగత నంబర్లకు డబ్బులు పంపకూడదనీ, అబ్బాయి, కుటుంబ సభ్యుల వివరాలను స్వతంత్రంగా తెలుసుకోవాలని, ఫొటోలు, ఉద్యోగం, ఆస్తుల వివరాలను మాత్రమే నమ్మకూడదనీ సైబర్ నిపుణులు చెబుతున్నారు తొందరపెట్టి డబ్బులు అడిగితే అప్రమత్తం కావాలనీ, మోసం జరిగితే చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాట్స్, ప్రొఫైల్ ఫొటోలు భద్రపరచాలనీ సూచిస్తున్నారు.

# వృద్ధ మహిళపై సీఐ దురుసు ప్రవర్తన

## మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



**అమరావతి,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**బాపట్ల జిల్లా చీరాల టూటౌన్ సీఐ శశికుమార్ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ ఓ ఇంటి బయట వృద్ధురాలితో అసభ్యంగా ప్రవర్తించడం, దూషించడంపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. సీసీ కెమెరాలో నమోదైన ఈ దశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నాయి. చట్టప్రకారం, నైతికంగా ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదంటూ ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు.బాపట్ల జిల్లా చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో తాజాగా చోటుచేసుకున్న ఘటన పోలీసు శాఖ ప్రతిష్టపై మరోసారి చర్చకు దారితీసింది. ఎస్‌టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన ఓ వృద్ధ మహిళతో రెండో పట్టణ సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సెప్టెంబర్ 6వ తేదిన ఆదివారం కార్డన్ సెర్చ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైరల్‌గా మారిన వీడియోలో సీఐ శశికుమార్ వృద్ధ మహిళతో దురుసుగా మాట్లాడుతున్న దృశ్యాలు, అభ్యంతరకరమైన పదజాలంతో సంభాషిస్తున్నట్లు కనిపించే, వినిపించే దృశ్యాలు పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలలో మరింత అపనమ్మకాన్ని కలిగించేలా ఉన్నాయి. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం పేరుతో కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉంటోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి ఒక వృద్ధ మహిళతో దురుసుగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. పోలీస్‌శాఖ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ లు నిర్వహించే హక్కు ఉన్నప్పటికీ, ఆ సమయంలో పౌరుల, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే అధికారం ఏ చట్టం ఇవ్వలేదు. పోలీసు నియమావళి ప్రకారం ప్రజలతో, ముఖ్యంగా బలహీన వర్గాలు, వృద్ధులతో సంయమనంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలి. డ్యూటీలో ఉండి కూడా దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించిన అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనలపై బాపట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ లేదా ఇతర ఉన్నతాధికారులకు సాక్ష్యాలతో కూడిన వీడియో, లేదా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసి న్యాయం కోరవచ్చు. పోలీసులు బూతులు తిట్టడం లేదా అసభ్య పదజాలం ఉపయోగించడం చట్టప్రకారం, నైతికంగా ఏమాత్రం సరైనది కాదు. భారత రాజ్యాంగం, చట్టాలు పౌరుల ఆత్మగౌరవానికి రక్షణ కల్పిస్తాయి. నిందితులతో లేదా సామాన్య ప్రజలతో మాట్లాడేటప్పుడు పోలీసులు గౌరవప్రదంగా ప్రవర్తించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. పోలీస్ మాన్యువల్, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, డ్యూటీలో ఉన్న ఏ పోలీస్ అధికారి కూడా పౌరులను దూషించడం, అవమానించడం చేయకూడదు. ఎవరైనా వ్యక్తిని పబ్లిక్‌గా బూతులు తిడితే లేదా అవమానిస్తే భారతీయ న్యాయ సంహిత, ఇతర నిబంధనల ప్రకారం అది నేరంగా పరిగణించబడుతుంది. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిని లేదా రోడ్డుపై వెళ్లే వాహనదారులను బూతులు తిట్టడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. ఒకవేళ పోలీసులు అలా ప్రవర్తిస్తే సదరు పోలీస్ అధికారిపై ఉన్నత అధికారులు డిఎస్పి, ఎస్పికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు.

# మంగళగిరిలో కనిపించిన అరుదైన 'పునుగుపిల్లి'

**,సెప్టెంబర్7(ప్రజావినికిడి):**

గుంటూరు జిల్లా మంగళగిరిలో అరుదైన పునుగుపిల్లి కనిపించడం స్థానికంగా ఆసక్తి రేపుతోంది. సోమవారం పట్టణంలోని ప్రసిద్ధ పానకాల నరసింహస్వామి కొండపైకి వెళ్తున్న భక్తులకు ఈ జీవి తారసపడింది. సాధారణంగా శేషాచలం, నల్లమల అడవుల్లో మాత్రమే కనిపించే ఈ పునుగుపిల్లి జనారణ్యంలో ప్రత్యక్షమవడం చర్చనీయాంశంగా మారింది. అయితే, మంగళగిరిలో కనిపించింది పునుగుపిల్లేనా అనే విషయాన్ని అటవీ శాఖ అధికారులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది.



### పునుగుపిల్లి తైలం ప్రాముఖ్యత

పునుగుపిల్లికి, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సేవకు విడదీయరాని సంబంధం ఉంది. ఈ జంతువు శరీరంలోని తోక దగ్గర ఉండే పెరినియల్ గ్రంథుల నుంచి 'జవాది' అనే సుగంధభరిత ద్రవం స్రవిస్తుంది. గాలికి ఆరిన తర్వాత ఇది మైనంలా మారుతుంది. దీనిని సేకరించి నువ్వుల నూనె, కస్తూరి, పచ్చకర్పూరం వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపి పవిత్రమైన తైలాన్ని తయారుచేస్తారు.

శతాబ్దాలుగా వస్తున్న ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం, తిరుమలలో ప్రతి శుక్రవారం శ్రీవారికి అభిషేకం నిర్వహించిన అనంతరం మూలవిరాట్‌కు ఈ తైలాన్ని లేపనంగా పూస్తారు. ఈ తైలం వల్ల స్వామివారి విగ్రహం పగుళ్లు రాకుండా నిత్యం నిగనిగలాడుతూ ఉంటుందని, దివ్యమైన తేజస్సును ఇస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతేకాకుండా, భక్తుల దృష్టి ప్రభావం నుంచి కూడా ఇది రక్షిస్తుందని నమ్ముతారు.

### వన్యప్రాణి చట్టం కింద సంరక్షణ

పునుగుపిల్లి అంతరించిపోతున్న జీవుల జాబితాలో ఉండటంతో వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద దీనికి రక్షణ కల్పించారు. ఈ నేపథ్యంలో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో వీటిని సంరక్షిస్తోంది. స్వామివారి సేవకు తైలం సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు టీటీడీ వీటి పెంపకానికి ప్రత్యేకంగా బడ్జెట్ కూడా కేటాయిస్తోంది.

చారిత్రక ఆధారాల ప్రకారం, 15వ శతాబ్దం నుంచే శ్రీవారి సేవలో ఈ తైలం వినియోగం ఉన్నట్లు తెలుస్తోంది. తిరుమల మాత్రమే కాకుండా దక్షిణ భారతదేశంలోని మరికొన్ని ప్రాచీన ఆలయాల్లోనూ ఈ సంప్రదాయం ఉంది. ఇంతటి విశిష్టత కలిగిన పునుగుపిల్లి ఇప్పుడు మంగళగిరి కొండపై కనిపించడం భక్తుల్లోనూ, స్థానికుల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ



## - దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

# వరల్డ్ కప్‌లో భువీ కచ్చితంగా ఉండాల్సిందే..

## • సెలక్టర్లకు మాజీ క్రికెటర్ విజ్ఞప్తి



భారత జట్టుకు విశేష సేవలందించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు 2027 వన్డే ప్రపంచకప్‌లో అవకాశం కల్పించాలని భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా డిమాండ్ చేశారు. ఐపీఎల్ తో పాటు ఇటీవల ముగిసిన యూపీ టీ20 లీగ్‌లో భువీ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే సెలెక్టర్లు భువీ పేరును పరిశీలించాలని రైనా సూచించారు. అక్టోబర్-నవంబర్ 2027లో సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఆయా దేశాల్లో ఉండే వేగవంతమైన, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై భువనేశ్వర్ అనుభవం, బంతిపై అతనికున్న నియంత్రణ భారత జట్టు విజయాలకు ఎంతో కీలకంగా మారుతాయని రైనా అభిప్రాయపడ్డారు. యూపీ టీ20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ జట్టు తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్ 11 మ్యాచుల్లో 14 వికెట్లు పడగొట్టారు. కేవలం వికెట్లే కాకుండా ఆయన వేసిన పొదుపైన బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 11 మ్యాచుల్లో ఆయన ఏకంగా 119 డాట్ బాల్స్ వేశారు. అంటే దాదాపు 20 ఓవర్ల పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేసారు. అంతేకాకుండా కేవలం 6.11 ఎకానమీ రేటుతో పరుగులు ఇచ్చి తనలోని పదును ఇంకా తగ్గలేదని నిరూపించారు. బౌలింగ్‌లో స్వింగ్, వైవిధ్యంతో ప్రత్యర్థులను తిప్పలు పెట్టడంలో భువీ శైలి ప్రత్యేకం. భారత జట్టు రాబోయే రోజుల్లో యువత, అనుభవం కలయికతో ముందుకు వెళ్లాలని రైనా ఆకాంక్షించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీల అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నట్లే, బౌలింగ్ విభాగంలో ఈ ఇద్దరు సీనియర్ పేసర్లు కూడా గిల్ ప్రణాళికల్లో భాగం కావాలని తెలిపారు. ముగ్గురు లేదా నలుగురు స్పెషలిస్ట్ పేసర్లను ఎంపిక చేసే క్రమంలో భువీ అనుభవాన్ని విస్మరించకూడదని వివరించారు. ఇక మీరట్ మెవ్రిక్స్ జట్టును విజేతగా నిలిపిన రింకూ సింగ్ కెప్టెన్సీ టాలెంట్ పై కూడా రైనా ప్రశంసల జల్లు కురిపించారు. ఒత్తిడి సమయంలో రింకూ ప్రదర్శించిన వ్యూహాత్మక చతురత అద్భుతమని కొనియాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం రింకూ సింగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశవాళీ టాలెంట్‌ను వెలికితీయడంలో యూపీ టీ20 లీగ్ ఎంతగానో తోడ్పడుతోందని కొనియాడారు.

# రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు!



## • పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం

పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి.ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణ పరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది.ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఎలాంటి కామెంట్ చేయడం లేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి' అని అమిర్ మిర్ పేర్కొన్నాడు. కానీ ఆటగాళ్ల మొబైల్స్ లాక్కున్నారనే వార్తలపై అతను స్పందించలేదు.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్..



ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి.హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది.

# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది



మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది.గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

# 'పుష్ప 2', 'ధురంధర్' చిత్రాలను దాటేసిన 'హనుమాన్ అంశ్'!



బాలీవుడ్‌లో 'హనుమాన్ అంశ్' అనే చిన్న చిత్రం సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన ఐదో వారాంతంలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నెలకొల్పింది. ఈ క్రమంలో 'పుష్ప 2' (హిందీ), 'ధురంధర్' వంటి భారీ చిత్రాలను సైతం వెనక్కి నెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది.ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా విశాల్ చతుర్వేది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఆగస్టు 7న విడుదలైన ఈ చిత్రం, తొలి రెండు వారాలు సాధారణ వసూళ్లతోనే సరిపెట్టుకుంది. అయితే, మూడో వారం నుంచి సానుకూలమైన 'మౌత్ టాక్' లభించడంతో కలెక్షన్ల వర్షం కురిపించింది. ఫలితంగా కేవలం 31 రోజుల్లోనే ఈ చిత్రం రూ. 100 కోట్ల మైలురాయిని అధిగమించింది.తాజాగా, సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు సాగిన ఐదో వారాంతంలో ఈ చిత్రం ఏకంగా రూ. 45.60 కోట్లు రాబట్టింది. ఇప్పటివరకు ఐదో వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో 'ధురంధర్' పార్ట్ 1 (రూ. 35.80 కోట్లు), 'పుష్ప 2' హిందీ వెర్షన్ (రూ. 14 కోట్లు) ఉన్నాయి. వాటన్నింటి రికార్డులను 'హనుమాన్ అంశ్' తుడిచిపెట్టేసింది.ఈ అరుదైన ఫీట్‌తో బాలీవుడ్ వాణిజ్య విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఐదో వారాంతపు వసూళ్లలో దీనిని నంబర్ వన్ చిత్రంగా వారు పేర్కొంటున్నారు. కాగా, ఈ సినిమాను సెప్టెంబర్ 11న ఓవర్సీస్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# తెలుగు హీరోల బిరుదులు.. అభిమానుల మనోభావాలు..
# ఫోర్బ్స్ కథనంతో వేడెక్కిన సోషల్ మీడియా!



ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ఇటీవల ప్రచురించిన ఒక కథనం తెలుగు సినీ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. 'షోస్టాపర్స్ 2026' ఫీచర్‌లో కథానాయకుడు అల్లు అర్జున్‌ను 'రెబల్ స్టార్' అని సంబోధించడమే ఈ వివాదానికి మూలకారణం. అల్లు అర్జున్‌కు 'స్టైలిష్ స్టార్', 'ఐకాన్ స్టార్' వంటి బిరుదులు ఉండగా.. ఫోర్బ్స్ పొరపాటున ఈ విధంగా పేర్కొంది.
వాస్తవానికి 'రెబల్ స్టార్' అనే బిరుదు ప్రభాస్‌కు చెందినది. ఆయన పెదనాన్న, దివంగత నటుడు కృష్ణంరాజు వారసత్వంగా ఈ బిరుదు ప్రభాస్‌కు వచ్చింది. దీంతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభిమాన హీరో బిరుదును మరొకరికి ఆపాదించడంపై అభ్యంతరం తెలిపారు. అభిమానుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తడంతో ఫోర్బ్స్ ఇండియా తమ డిజిటల్ కథనాన్ని అప్‌డేట్ చేసి, 'రెబల్ స్టార్' స్థానంలో 'ఐకాన్ స్టార్' అని మార్చినట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై ఫోర్బ్స్ ఇండియా గానీ, అల్లు అర్జున్ బృందం గానీ అధికారికంగా స్పందించలేదు.ఈ ఘటనపై దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ స్పందిస్తూ.. తెలుగు ప్రేక్షకులు తమ అభిమాన హీరోలకు, వారి బిరుదులకు ఎంతలా కనెక్ట్ అయి ఉంటారో ఈ సంఘటన తెలియజేస్తోందన్నారు. "తెలుగు సినిమా అభిమానులు తమ హీరోల బిరుదులను ఎంతగానో ఇష్టపడతారు. వారిని ఆరాధిస్తారు. వేలాదిగా ఉన్న అభిమాన సంఘాల ద్వారా హీరోలను దేవుళ్లుగా భావిస్తారు. ఈ బిరుదులు వారికి ఒక గర్వాన్ని, గుర్తింపును ఇస్తాయి. అందుకే తమ హీరో పేరుతో ముడిపడిన బిరుదుల విషయంలో చాలా సున్నితంగా ఉంటారు" అని ఆయన విశ్లేషించారు.తెలుగు సినీ పరిశ్రమలో ఈ బిరుదుల సంస్కృతి ఎప్పటినుంచో బలంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి, గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ, కింగ్ నాగార్జున, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ వంటి ఎందరో స్టార్లకు ప్రత్యేకమైన బిరుదులు ఉన్నాయి. పెద్ద సినీ కుటుంబాల నుంచి రాని రవితేజ (మాస్ మహారాజా), రామ్ పోతినేని (ఎనర్జిటిక్ స్టార్) వంటి హీరోలకు కూడా అభిమానులు ఇష్టంగా పిలుచుకునే బిరుదులున్నాయి."సోషల్ మీడియా యుగంలో ఈ అభిమానం, వాదనలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక హీరోతో బలంగా ముడిపడి ఉన్న బిరుదును మరొకరికి వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని చంద్ర సిద్ధార్థ్ సూచించారు. బాలీవుడ్, మలయాళంలో ఈ తరహా బిరుదుల ట్రెండ్ తక్కువగా ఉన్నా, తమిళ పరిశ్రమలో కొందరు స్టార్లకు ఉందని ఆయన గుర్తుచేశారు.ఈ ట్రెండ్ కేవలం హీరోలకే పరిమితం కాదని, హీరోయిన్లలోనూ పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. "గతంలో 'లేడీ అమితాబ్'గా విజయశాంతి గుర్తింపు పొందారు. ఇప్పుడు రష్మిక 'నేషనల్ క్రష్'గా, నయనతార, సమంత 'లేడీ సూపర్‌స్టార్లు'గా పిలవబడుతున్నారు. భవిష్యత్తులో మరింత మంది నటీమణులు ఇలాంటి ప్రత్యేక బిరుదులు పొందే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద ఫోర్బ్స్ చేసిన చిన్న పొరపాటు తెలుగు సినిమా రంగంలో బిరుదులకు, అభిమానుల భావోద్వేగాలకు ఉన్న విడదీయరాని బంధాన్ని మరోసారి స్పష్టం చేసింది.

# టైటిల్ సెంటిమెంట్‌తో బాలయ్య ఫ్యాన్స్ సంబరాలు..!

'వీర సింహా రెడ్డి' తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబోలో భారీ అంచనాల నడుమ సినిమా రూపొందుతున్న విషయం తెల్సిందే. ఇన్ని రోజులు చీదీఖ111 అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ జరుపుకున్న ఈ సినిమాకు టైటిల్‌ను కన్ఫర్మ్ చేశారు. దర్శకుడు గోపీచంద్ మలినేని పవర్ ఫుల్ టైటిల్‌ను బాలకృష్ణ మూవీ కోసం ఫైనల్ చేయడంతో పాటు, అభిమానుల ముందుకు తీసుకు వచ్చాడు. బాలకృష్ణ ను 'దాదా' గా చూపించబోతున్నట్లు గ్లిమ్స్ విడుదల చేసి మరీ ప్రకటించారు. బాలకృష్ణ అభిమానులతో పాటు రెగ్యులర్ సినీ ప్రేక్షకులు 'దాదా' టైటిల్ విషయంలో సానుకూలంగా ఉన్నారు. ముఖ్యంగా బాలకృష్ణ వంటి మాస్ ఇమేజ్ ఉన్న హీరోకు 'దాదా' టైటిల్ సరిగ్గా సరిపోతుందనే అభిప్రాయంను ఫ్యాన్స్, ప్రేక్షకులు వ్యక్తం చేస్తున్నారు. కథానుసారంగా దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ సినిమాకు 'దాదా' అయితే అన్ని విధాలుగా బాగుంటుంది అని భావించాడట. బాలకృష్ణ, గోపీచంద్ మలినేని మూవీ 'దాదా'... బాలకృష్ణ మూవీకి 'దాదా' అనే టైటిల్‌ను ఖరారు చేయడం పట్ల నందమూరి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో రెండు లెటర్స్ టైటిల్స్‌కి మంచి స్పందన ఉంటుంది. చిరంజీవి కాకా, అల్లు అర్జున్ రాకా సినిమాలతో రాబోతున్నారు. ఇప్పటికే రామ్ చరణ్ 'పెద్ది' సినిమాతో వచ్చి ఆకట్టుకున్న విషయం తెల్సిందే. అందుకే బాలకృష్ణ దాదా టైటిల్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే అభిప్రాయంను ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. పైగా బాలకృష్ణకు రెండు అక్షరాల టైటిల్ సెంటిమెంట్ ఉంది. సింహా సినిమా ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో తెలిసిందే. అలాగే దర్శకుడు గోపీచంద్ మలినేని సైతం రెండు అక్షరాల టైటిల్స్‌తో వచ్చి హిట్ కొట్టాడు. అందులో ఒకటి క్రాక్ కాగా, మరోటి జాట్ మూవీ. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో దాదా సైతం కచ్చితంగా హిట్ అవుతుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. బాలకృష్ణ కోసం పవర్ ఫుల్ టైటిల్.. 'దాదా' టైటిల్‌తో బాలకృష్ణ మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం ఖాయం అనే అభిప్రాయంను చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో టైటిల్స్ విషయంలో ఫిల్మ్ మేకర్స్ ఏ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలిసిందే. అందుకే ఈ టైటిల్ విషయంలోనూ దర్శకుడు గోపీచంద్ మలినేని చాలా ఆలోచించాడు, ఈ టైటిల్‌ను కొన్ని వారాల



ముందే అనుకున్నప్పటికీ అభిమానుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అని ఎదురు చూశాడు. టైటిల్‌ను లీక్ చేసి అభిమానుల స్పందన తెలుసుకున్నాడు. దాదాతో పాటు మరికొన్ని టైటిల్స్‌ను సైతం లీక్ చేయడం జరిగింది. అయితే ఎక్కువ శాతం అభిమానులు దాదా టైటిల్‌పై మక్కువ చూపడంతో పాటు, బాలయ్య ఇమేజ్‌కి సరైన టైటిల్ అనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఫైనల్ గా ఈ టైటిల్ వైపు వెళ్లినట్లుగా చిత్ర యూనిట్ సభ్యుల నుంచి సమాచారం అందుతోంది.

# మెగాస్టార్‌తో వర్క్ చేయడంపై హీరోయిన్ ఎమోషనల్ స్టేట్‌మెంట్

చిత్ర పరిశ్రమలో ఎవరిని ఎప్పుడు అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. టాలెంట్ ఉండి సరైన అవకాశం కోసం ఎదురుచూసే నటులకు ఒక్కోసారి ఊహించని మెగా ఆఫర్లు తలుపు తడతాయి. మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ విషయంలోనూ సరిగ్గా ఇదే జరిగింది. తెలుగులో కేవలం ఒక్క సినిమాతోనే తన నటనతో అలరించిన ఈ భామ, ఇప్పుడు ఏకంగా మెగాస్టార్ చిరంజీవితో నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసింది. ఈ సందర్భంగా ఆమె ఇచ్చిన ఎమోషనల్ స్టేట్‌మెంట్ నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు ప్రవేశం నుంచి మెగా లక్కీ ఛాన్స్: రోషన్ హీరోగా తెరకెక్కిన 'ఛాంపియన్' సినిమాతో అనస్వర రాజన్ తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకున్నప్పటికీ, ఆమె సహజ సిద్ధమైన నటనకు టాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. టాలీవుడ్‌లో ఈ చిన్నదానికి మంచి భవిష్యత్తు ఉంటుందని సినీ విశ్లేషకులు భావించారు. అనుకున్నట్లుగానే ఆమెకు తన రెండో ప్రాజెక్ట్‌లోనే ఏకంగా మెగాస్టార్ చిరంజీవి సినిమాలో నటించే అరుదైన అవకాశం లభించింది.



# తెలుగు రాష్ట్రాల్లో 'వారణాసి' ప్రీ-బిజినెస్ హవా!

తెలుగు చిత్రసీమ స్థాయిని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి-సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న -వారణాసి- చిత్రం బాక్సాఫీస్ రికార్డులను సృష్టించకముందే ప్రీ-రిలీజ్ బిజినెస్‌లో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. గతంలో రాజమౌళి తెరకెక్కించిన -బాహుబలి 2- చిత్రం తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 122 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేయగా.. ఆ తర్వాత వచ్చిన -ఆర్ఆర్ఆర్- చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో (ఆ్రూ & ూ) ఏకంగా 230 కోట్ల మేర ప్రీ-రిలీజ్ బిజినెస్ సాధించి రికార్డు నెలకొల్పింది. అయితే ఇప్పుడు -వారణాసి- చిత్రం ఈ రెండు ఇండస్ట్రీ హిట్లను వెనక్కి నెట్టి.. ప్రీబిజ్‌లో ఎవరూ ఊహించని మైలురాయిని తాకనుందని ట్రేడ్ వర్గాల్లో గుసగుస వినిపిస్తోంది.ూశ్రీంశీ =ము౧ - ఆ యంగ్ హీరో విషయంలో నటి ఓవరేక్షన్! ప్రస్తుతం ఫిలిం నగర్ వర్గాల విశ్లేషణల ప్రకారం.. -వారణాసి- సినిమా కేవలం ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ థియేట్రికల్ హక్కుల రూపంలోనే ఏకంగా 320 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ జరుపుకుంటున్నట్లు తెలుస్తోంది. -బాహుబలి 2- బిజినెస్‌తో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు కాగా, -ఆర్ఆర్ఆర్- ప్రీ-రిలీజ్ బిజినెస్ కంటే దాదాపు 90 కోట్లు అధికం. తెలుగు సినిమా చరిత్రలోనే కేవలం ఒక ప్రాంతీయ మార్కెట్ నుండి ఈ స్థాయిలో 300 కోట్ల మార్కును దాటి థియేట్రికల్ బిజినెస్ జరగడం నిజంగా ఒక అసాధారణమైన సంచలనంగా విశ్లేషిస్తున్నారు. ఇది రాజమౌళి బ్రాండ్ వాల్యూకు నిదర్శనంగా నిలుస్తోంది.ఈ స్థాయిలో ప్రీ-రిలీజ్ బిజినెస్ హైప్ పెరగడానికి ప్రధాన కారణం మూవీకి ఎంచుకున్న భారీ బడ్జెట్- యూనివర్సల్ కాన్సెప్ట్. దాదాపు 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ అప్పీల్ ఉన్న కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30కి పైగా భాషల్లో.. 120కి పైగా దేశాల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. -ఆర్ఆర్ఆర్- ఆస్కార్ విజయం తర్వాత రాజమౌళికి అంతర్జాతీయంగా లభించిన గుర్తింపు.. మహేష్ బాబు మార్కెట్ స్టామినా కలవడంతో డిస్ట్రిబ్యూటర్లు ఈ చిత్రంపై ఇంతటి భారీ మొత్తాన్ని వెచ్చించడానికి సిద్ధపడతున్నారు.ఇక నటీనటులు.. పాత్రల పరంగానూ -వారణాసి- ప్రేక్షకుల్లో గొప్ప ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో మహేష్ బాబు రుద్ర, పురాణ పురుషుడు శ్రీరాముడుగా.. రెండు విభిన్నమైన పవర్ ఫుల్ పాత్రల్లో ద్విపాత్రాభినయం చేస్తుండటం గమనార్హం. మహేష్ సరసన గ్లోబల్ నటి ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. మలయాళ సూపర్ స్టార్ పృథ్విరాజ్ సుకుమారన్ పవర్‌ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి స్వరాలు సమకూరుస్తుండటం.. కే.ఎల్. నారాయణ - ఎస్.ఎస్. కార్తికేయలు సంయుక్తంగా నిర్మిస్తుండటం ఈ ప్రాజెక్ట్ రేంజ్‌ను మరింత పెంచాయి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613